## క్లుప్తంగా

### పేదలకు అండగా 'బీఆర్ఎస్'



హన్మకొండ: పేదలకు అండగా బీఆర్ఎస్ సర్కారు నిలుస్తోందని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. హనుమకొండ కనకదుర్గ కాలనీలోని తన స్వగృహంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి చెందిన 41మందికి రూ.20,28,500 విలువ గల చెక్కులను పంపిణీ చేసినట్లు వివరించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఇక్కడ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు.

### మోడల్ మార్కెట్‌లో తనిఖీలు

వరంగల్: వరంగల్ లక్ష్మీపురంలోని మోడల్ కూరగాయల మార్కెట్‌లో వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి బీవీ.రాహుల్ గురువారం తనిఖీలు నిర్వహించారు. మార్కెట్‌లో స్థలాలు (ప్లాట్లు) తీసుకున్న వారిలో కొందరు వ్యాపారం చేయకుండా అద్దెకు ఇస్తున్నారని, మరికొంత మంది అసలు వ్యాపారమే చేయడం లేదని వచ్చిన ఆరోపణలపై ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసినట్లు తెలుస్తోంది. మార్కెట్‌లో క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టడంపై పాట్లురాని చిల్లర వ్యాపారులు తమకు వస్తాయన్న ఆశతో ఎదురు చూస్తున్నారు.

### విద్యకు సర్కారు పెద్దపీట

హసన్‌పర్తి: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోందని మార్కెట్ కమిటీ డైరెక్టర్ చకిలం రాజేశ్వర్‌రావు అన్నారు. విద్యార్థులకు అమలు చేస్తున్న రాగి జావా పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. హెచ్ఎం కుమార్, విద్యాభివృద్ధి కమిటీ చైర్మన్ యాదగిరి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వీసం సురేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఆశ కార్యకర్తల ధర్నా

ఎంజీఎం: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హనుమకొండ డీఎంహెచ్ఓ కార్యాలయం ఎదుట ఆశ కార్యకర్తలు గురువారం ఆందోళన నిర్వహించారు. అనంతరం డీఎంహెచ్ఓ సాంబశివరావుకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌టీయూ జిల్లా కన్వీనర్ నాయిని రవి, రాష్ట్ర నాయకురాలు మైమొద, ఆశ కార్యకర్తల యూనియన్ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి రషీద, సభ్యులు శోభ, యాదమ్మ, మౌనిక పాల్గొన్నారు.

### ఎస్సీ రిజర్వేషన్ వర్తింపజేయాలి



హన్మకొండ అర్బన్: క్రిస్టియన్ మతం స్వీకరించిన దళితులు, ముస్లింలకు ఎస్సీ రిజర్వేషన్ వర్తింపజేయాలని వరంగల్ డయాసిస్ ఎస్సీ, బీసీ కమిషన్ సభ్యులు కొట్టె అశోక్, బైరిపాక ప్రభాకర్ కోరారు. ఈమేరకు హనుమకొండ కలెక్టరేట్ సూపరింటెండెంట్ కృష్ణమూర్తికి గురువారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కమిషన్ సభ్యులు పాల్గొన్నారు.

### కార్యకర్తలకు అండగా ఉంటా..



హసన్‌పర్తి: కార్యకర్తలకు అండగా ఉంటానని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్రస్థాయి బోర్డు కమిటీ సభ్యుడు బూర సురేందర్ అన్నారు. బోర్డు సభ్యుడిగా నియమితులై భీమారం గ్రామానికి గురువారం వచ్చిన సందర్భంగా ఆయనకు గజమాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న శాసనసభ ఎన్నికల్లో రాష్ట్ర రాజధానిపై బీజేపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు తీగల భరత్‌గౌడ్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

### రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం

కాశిబుగ్గ: రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన ఎల్గూర్ - నెక్కొండ రైల్వే స్టేషన్ల మధ్య గురువారం చోటు చేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం సుమారు 35 - 40 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి నెక్కొండ తహసీల్దార్ కార్యాలయం సమీపంలో డౌన్ లైన్ ట్రాక్‌పై మృతిచెంది ఉన్నట్లు గుర్తించారు. ఆ మృతదేహాన్ని ఎంజీఎం ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు సీఐ తెలిపారు. మృతుడి వివరాలకు వరంగల్ జీఆర్పీ స్టేషన్ లేదా 94415 57232, 87126 58585 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

### ఆశ్రమానికి విరాళాలు ఇవ్వండి

హసన్‌పర్తి: తిరుపతి దేవస్థాన ఆవరణలో కొత్తగా నిర్మిస్తున్న ఆశ్రమానికి విరాళాలు ఇవ్వాలని గురుజీ ప్రబోధానంద స్వామి కోరారు. ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో గోవిందస్వాముల దీక్ష గోష్ఠి గురువారం జరిగింది. ఈ సందర్భంగా ప్రబోధానందస్వామి మాట్లాడుతూ ప్రతీఏటా గోవిందస్వాముల దీక్ష చేపట్టాలని సూచించారు.

# సీపీఎస్ ఉద్యోగులు తరలిరావాలి



సమావేశంలో సీపీఎస్, ఓపీఎస్ ఉద్యోగులు



కాజీపేట రూరల్: మాట్లాడుతున్న మురళి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

కాశిబుగ్గ: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలనే డిమాండ్‌తో టీఎస్‌సీపీఎస్ఈయూ ఆధ్వర్యంలో ఈనెల 12న చేపట్టే చలో హైదరాబాద్ సభకు సీపీఎస్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని టీఎస్‌సీపీఎస్ఈయూ జిల్లా కార్యదర్శి మధుసూదన్ పిలుపునిచ్చారు. లేబర్‌కాలనీలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల ఉద్యోగులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో శనివారం జరగనున్న సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ గణేశ్వర్‌రెడ్డి, హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ జగన్మోహనాచారి, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ అశోక్, డాక్టర్ జ్ఞానేశ్వర్, డాక్టర్ శిరీష, డాక్టర్ జ్యోతి, డాక్టర్ వేణుగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

### పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలి

కాజీపేట రూరల్: పాత పింఛన్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం పునరుద్ధరించాలని రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ కేంద్ర కమిటీ సభ్యుడు సీహెచ్.మురళి డిమాండ్ చేశారు. అన్ని కార్మిక వర్గాలు ఏకమై న్యూఢిల్లీ రామలీల మైదానంలో జాయింట్ ఫోరం ద్వారా చేపట్టిన ర్యాలీకి మద్దతు తెలుపుతూ సంఘ్ రన్నింగ్ బ్రాంచీ ఆధ్వర్యంలో కాజీపేట రైల్వే డ్రైవర్ల కార్యాలయం ఎదుట గురువారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో లోకో రన్నింగ్ బ్రాంచ్ వర్కింగ్ ప్రెసిడెంట్ పాక రాజ్‌కుమార్, రైల్వే సంఘ్ లోకోరన్నింగ్ బ్రాంచీ చైర్మన్ కే.రవి, వరప్రసాద్‌రెడ్డి, లక్ష్మినారాయణ, సుధాకర్, నర్సింగరావు, గుత్తికొండ నారాయణ, రవికాంత్, యాకాంబరం, రమేష్, మహేందర్, సదా, శ్రీను, గుప్తా, కోటిరెడ్డి, కుమారస్వామి, రాకేష్, రాజేష్, సునిత్, సతీష్, గార్డులు, లోకోపైలట్లు, అసిస్టెంట్ లోకోపైలట్లు పాల్గొన్నారు.

### సీపీఎస్ ధర్నా వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

మడికొండ: సీపీఎస్‌ను రద్దు చేయాలని ఈనెల 12వ తేదీన హైదరాబాద్‌లో తలపెట్టిన ధర్నా కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను కాజీపేట మండల వనరుల కేంద్రంలో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) ఇంగ్లిష్ ట్రైనింగ్ ప్రోగ్రాం ఉపాధ్యాయులు మధ్యాహ్నం భోజన విరామ సమయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘాలకు అతీతంగా ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామచంద్రారెడ్డి, రవీందర్, శశిధర్‌రెడ్డి, వినోద్, శ్రీదేవి, మంజుల, లక్ష్మి, విజయలక్ష్మి, విజయలక్ష్మి, వాణి, శోభారాణి, ధనలక్ష్మి, అరుణ, కిరణ్‌రెడ్డి, వేణు, వేణుగోపాల్, రజనీ, కవిత పాల్గొన్నారు.

# 'కార్పొరేట్ల కొమ్ముకాస్తున్న కేంద్రం'



వరంగల్ కలెక్టరేట్ ఎదుట ధర్నాలో కార్మిక సంఘాల నాయకులు



మాట్లాడుతున్న తోట భిక్షపతి

కరీమాబాద్: ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ముకాస్తోందని కార్మిక సంఘాల నాయకులు ఆరోపించారు. ఆల్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో మహా పడావ్ కార్యక్రమంలో భాగంగా ఏకశిల పార్కు నుంచి ర్యాలీగా వెళ్లి వరంగల్ కలెక్టరేట్ ఎదుట గురువారం మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ దేశంలోని సహజ వనరులు, ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా స్వదేశీ, విదేశీ కార్పొరేట్ శక్తులకు కేంద్రం అమ్మేస్తోందని విమర్శించారు. నిత్యావసర సరుకుల ధరలు అమాంతం పెరిగిపోతున్నా మోదీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోయారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్ శ్రీవత్సకు అందజేశారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ నాయకులు రామస్వామి, చెన్నకేశవులు, కృష్ణ, దయాకర్, సాగర్, బాబు, సాజియా, రాధిక, యాదగిరి, ఉపేందర్, ప్రభాకర్, ఓదెలు, శంకర్, చారి, రవి, రాఘవ రెడ్డి, యాకూబ్‌పాషా, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

### కార్మిక చట్టాల పరిరక్షణకు పోరాటాలు

హన్మకొండ అర్బన్: కార్మిక చట్టాల పరిరక్షణకు సమరశీల పోరాటాలు నిర్వహించాలని ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట భిక్షపతి, సీఐటీయూ జిల్లా నాయకులు ప్రభాకర్‌రెడ్డి, బీఆర్‌టీయూ జిల్లా నాయకుడు నాయిని రవి, ఏఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు అప్పారావు అన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం రెండవ రోజు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా, కార్మిక సమస్యలను గాలికొదిలేసి కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తోందని ఆరోపించారు. 73శాతం సంపద ఒకశాతం ఉన్న సంపన్నుల వద్ద కేంద్రీకృతమైందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు జక్కు రాజుగౌడ్, మద్దెల ఎల్లేష్, రామ్మూర్తి, మంచాల తిరుపతి, శంకర్, వేల్పుల సారంగపాణి, సంపత్, రవి, నాయిని రవి, ప్రణయ్ పాల్గొన్నారు.

# జెండా ఎగరేసి దేశభక్తిని చాటాలి



జాతీయ జెండాలతో తపాలాశాఖ అధికారులు



జెండాలను పంపిణీ చేస్తున్న నాయకులు

ఖిలా వరంగల్: జాతీయ జెండాను ఎగరవేసి దేశభక్తిని చాటుకోవాలని వరంగల్ డివిజన్ పర్యవేక్షకుడు నరసింహస్వామి అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా వరంగల్ డివిజన్ హెడ్ పోస్టాఫీస్ అధికారుల ఆధ్వర్యంలో తపాలా శాఖ నుంచి మధ్యకోట వరకు హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరు తమ ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలని కోరారు.

### జాతీయ జెండాల పంపిణీ

వరంగల్ చౌరస్తా: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుసుమ సతీష్‌బాబు ఆధ్వర్యంలో వరంగల్ హెడ్ పోస్టాఫీస్ సెంటర్‌లో జాతీయ జెండాలను ప్రజలకు గురువారం పంపిణీ చేశారు. రత్నం సతీష్ షా, రఘునారెడ్డి, రంజిత్, సుమన్, వెంకటేశ్వర్లు, మురళికృష్ణ, శ్యామ్‌సుందర్, సత్యనారాయణ, ఓంప్రకాష్, మల్లికార్జున్, సంపత్, సాయి, ప్రసాద్, శరత్, చంద్రమౌళి, దేవేందర్, సతీష్ పాల్గొన్నారు.

### సీపీఆర్ విధానంపై నర్సింగ్ విద్యార్థినులకు అవగాహన



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న మంజుల

మడికొండ: సీపీఆర్‌పై కాజీపేట మండలం మడికొండ శివారులోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలోని నర్సింగ్ విద్యార్థినులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మంజుల పాల్గొని సీపీఆర్ చేసే విధానాన్ని చేసి చూపించారు. గుండెపోటు, శ్వాస సంబంధిత సమస్యలు తలెత్తితే మొదటి 4నిమిషాల్లో సీపీఆర్‌ను అందించడం ద్వారా 99శాతం మరణాల రేటును తగ్గించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మహిళా ప్రాంగణం మేనేజర్ జయశ్రీ, సుశీల, నీరజ, ప్రత్యూష, కస్తూరి, వీణ పాల్గొన్నారు.

# మహిళా చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న లీగల్ కౌన్సిలర్లు శ్రీదేవి, వినీల

హన్మకొండ అర్బన్: మహిళా చట్టాలపై మహిళలు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని లీగల్ కౌన్సిలర్లు శ్రీదేవి, వినీల అన్నారు. నగరంలోని క్యూబా కాలనీలో సఖి వన్‌స్టాప్ కేంద్రం ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సఖి సెంటర్ ముఖ్య ఉద్దేశాలు, అందిస్తున్న సేవలను వివరించారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కౌన్సిలింగ్ సహాయం, వైద్య, పోలీస్, న్యాయ సహాయం, తాత్కాలిక వసతి సేవల గురించి చెప్పారు. ఆపద సమయంలో బాధిత మహిళలు, బాలికలు 181 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి తక్షణ సహాయం, రక్షణ పొందాలని సూచించారు. కార్యక్రమంలో సీఓ నాగరాజు, ఆర్‌పీ షహనాజ్, ఎస్‌హెచ్‌జీ గ్రూప్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

# రైల్వే మజ్దూర్ యూనియన్ గేట్ మీటింగ్



గేట్ మీటింగ్‌లో రైల్వే నాయకులు

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే డీజిల్ లోకోషెడ్ ఎదుట గురువారం ఆల్ ఇండియా రైల్వే మెన్ ఫెడరేషన్ పిలుపు మేరకు నూతన పెన్షన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ రైల్వే మజ్దూర్ యూనియన్ డీజిల్ బ్రాంచీ ఆధ్వర్యంలో గురువారం గేట్ మీటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో డీజిల్ బ్రాంచీ చైర్మన్ వేదప్రకాష్, జనరల్ బ్రాంచ్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ పాత పింఛన్ విధానాన్నే అమలు చేయాలని డిమాండ్ చేశారు. డీజిల్ బ్రాంచీ మజ్దూర్ యూనియన్ చైర్మన్ పాక వేదప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన గేట్‌మీటింగ్‌లో నాయకులు డాక్టర్ శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్, భిక్షపతి, ఎస్‌కే.జానీ, గిరిమిట్ల రాజేశ్వర్, తిరుపతి, శంకర్, శివకుమార్, నరేష్‌యాదవ్, అశోక్, బాబురావు, శ్రీధర్, యాదగిరి, సంగి శ్రీను, అజీమ్, సదానందం, దేవేందర్, ఐలయ్య, సెక్రటరీ భీష్మ, భాస్కర్‌రెడ్డి, అంతయ్య, సుధ, లావణ్య కార్మికులు పాల్గొన్నారు.

### గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



పాడి గేదెకు టీకా వేస్తున్న డాక్టర్ మాళవిక

ఖిలా వరంగల్: వరంగల్ 17వ డివిజన్ వసంతాపురం గ్రామంలో తూర్పుకోట పశు వైద్యశాల డాక్టర్ మాళవిక ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ గద్దె బాబు హాజరై డాక్టర్ మాళవికతో కలిసి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువులు, గొర్రెలు, మేకలు, పాడి గేదెలకు గాలికుంటు వ్యాధి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సింధుజ, శ్రీనివాస్, శివ, వికిల్, చంద్రమౌళి, ప్రవీణ్, నాగరాజు, రాజారాం, రవి, గోపి, గద్దె లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

# చదువు మానేసిన వారికి ఓపెన్ స్కూల్ ఓ వరం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఉపేందర్‌రెడ్డి, శంకర్‌రావు

విద్యారణ్యపురి: సార్వత్రిక విద్య ఓపెన్ స్కూల్ ఎంతో సులభమైనదని, చదువు మధ్యలో నిలిపివేసిన వారికి ఓపెన్ స్కూల్ విద్య ఓ వరంలాంటిదని ప్రేరణ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పెండ్లి ఉపేందర్‌రెడ్డి అన్నారు. ఓపెన్ స్కూల్ ప్రాధాన్యతపై అవగాహనలో భాగంగా హనుమకొండలోని బాలసముద్రం కంచరకుంట ప్రాంతంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ మురాల శంకర్‌రావుతో కలిసి ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్లు, బ్రోచర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందితో పాటు తదితరులకు ఓపెన్ స్కూల్ అడ్మిషన్లపై అవగాహన కల్పించారు. ఈనెల 11నుంచి 31వ తేదీ వరకు అపరాధ రుసుంతో ప్రవేశాలకు గడువు ఉందని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ పేదరికం నిర్మూలన సంస్థ వలంటీర్లు, రిటైర్డ్ ఉపాధ్యాయులు మల్లారెడ్డి, స్వప్న, స్వర్ణ, రజిత, శోభ, అవినాష్, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

# విజయ్ కుటుంబాన్ని ఆదుకోవాలి



ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

కరీమాబాద్: రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో మలక్‌పేట పోలీస్‌స్టేషన్ ఎదుట పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విజయ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బన్న ప్రభాకర్ డిమాండ్ చేశారు. విజయ్ మృతికి కారకులైన ఎంఐఎం పార్టీకి చెందిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈమేరకు దళితులపై తెలంగాణ ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలకు నిరసనగా గ్రేటర్ పరిధిలోని 43వ డివిజన్ నాయుడు పెట్రోల్‌పంప్ జంక్షన్‌లో గురువారం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ చనిపోయిన విజయ్ కుటుంబానికి ప్రభుత్వం వెంటనే డబుల్‌బెడ్రూం ఇల్లు, రూ.50 లక్షల నగదు, ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మాదాసు రాజు, రాజ్‌కుమార్, వీరస్వామి, రాములు, సాంబయ్య, సుధాకర్, చంద్రశేఖర్, అనిల్, ఐలయ్య, దయాకర్, నాగరాజు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

# ఆర్ట్స్ కళాశాలలో అమృత్ మహోత్సవ్ ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

కేయూ క్యాంపస్: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మేరీ మట్టి.. మేరా దేశ్ కార్యక్రమాన్ని హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బన్న అయిలయ్య మాట్లాడుతూ దేశరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన వారిని గుర్తుచేసుకోవాలని సూచించారు. భూమి ఆవశ్యకతను తెలుసుకోవాలన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ హనుమంతు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ శ్రీదేవి, చందులాల్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ కనకయ్య పాల్గొన్నారు.

# బీసీలను అసెంబ్లీకి పంపడమే లక్ష్యం



సమావేశంలో పాల్గొన్న నాయకులు

హన్మకొండ: 60శాతం మంది బీసీలను అసెంబ్లీకి పంపడమే బీఎస్పీ లక్ష్యమని ఆ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు శనిగరపు రాజు, జిల్లా ఇన్‌చార్జ్ బొల్లంపల్లి సారయ్య అన్నారు. హనుమకొండలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి పార్టీని పటిష్టం చేయాలని కార్యకర్తలు, నాయకులకు సూచించారు. పార్టీలోకి చేరికలను ఆహ్వానించాలన్నారు. సభ్యత్వాన్ని పెంచాలని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో పార్టీ గద్దెలు నిర్మించి ప్రతీ ఆదివారం ఒక మండల కేంద్రంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించాలన్నారు. సమావేశంలో చేరికల కోసం చేరికల కమిటీ వేశారు. జిల్లాలో బీసీ నాయకత్వాన్ని పెంచడానికి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా మంజుల మణి (వద్దెర), జిల్లా కోశాధికారిగా పసునూటి నితీష్ (రజక)ను నియమించినట్లు తెలిపారు. సమావేశంలో బీఎస్పీ జోనల్ మహిళా కన్వీనర్ అడ్లూరి పద్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఒంటేరు చక్రీ, నాయకులు పసుల వినయ్ అంబేద్కర్, మినాజ్, జాల రామ్, ఇమ్మడి హరినారాయణ, సిరికొండ లత, గడ్డం రజిత తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా

### ఏఐఎస్ఎఫ్ నాయకులపై దాడి సరికాదు

హసన్‌పర్తి: ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు రెహమాన్‌తోపాటు ఇతర నాయకులపై అకారణంగా దాడి చేయడంపై ఆ సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు భీమారంలో గురువారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కసరబోయిన రవితేజ మాట్లాడుతూ విద్యార్థి సమస్యల పరిష్కారానికి సెక్రటేరియట్ ముట్టడికి వెళ్తున్న క్రమంలో విద్యార్థి సంఘాల నేతలపై డీసీపీ వెంకటేశ్వర్లు దాడి చేశారని పేర్కొన్నారు. డీసీపీని సస్పెండ్ చేయకపోతే ఆందోళన కార్యక్రమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌గౌడ్, నాయకులు చరణ్, రమేష్, సునీల్, రవి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

### ఎస్సీ, ఎస్టీలకు మినహాయింపు ఇవ్వాలి

హన్మకొండ అర్బన్: వైన్స్ టెండర్ రూ.2 లక్షల డిపాజిట్ నుంచి ఎస్సీ, ఎస్టీలకు మినహాయింపు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇల్లందు రాజేష్ ఖన్నా ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సంఘం నాయకులతో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్ జీని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి విజయ్‌కుమార్, ఉపాధ్యక్షులు జన్ను సందీప్, ఇల్లందుల భాస్కర్, బొట్ల కుమార్, ప్రధాన కార్యదర్శి పోగుల రాకేష్, హనుమకొండ, కాజీపేట మండలాల అధ్యక్షులు గిన్నారపు సునీల్‌కుమార్, కొడవటి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

### 4, 5వ తేదీల్లో ఎస్ఎఫ్ఐ మహాసభలు



కేయూ క్యాంపస్: సెప్టెంబర్ 4, 5వ తేదీల్లో హనుమకొండ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ పిలుపునిచ్చారు. హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆవరణలో మహాసభల కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కమిటీ బాధ్యులు మయూరి, వినయ్, సందీప్, శివ, సంపత్, రెహనా, రాజ్‌కుమార్, సాయి, సలీం, ఉదయ్ పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ

కాజీపేట రూరల్: కాజీపేట 47వ డివిజన్ భవానీనగర్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు బైరి శ్రీనివాస్‌ను ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ గురువారం పరామర్శించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సంకు నర్సింగరావు, నాయకులు సిరిల్‌లారెన్స్, మర్యాల కృష్ణ, దువ్వ కనకరాజు, దువ్వ నరేష్, గోల్కొండ రాంబాబు, జేరిపోతుల వెంకన్న, భూషపాక శ్రీనివాస్, దుప్పటి శివకుమార్, భిక్షపతి, నరేష్, మతిన్, మైలారం శంకర్, సల్లూరి నాగేష్ పాల్గొన్నారు.

### 62వ డివిజన్ సోమిడిలో..

కాజీపేట: కాజీపేట పట్టణం 62వ డివిజన్ సోమిడి గ్రామంలో అనారోగ్య సమస్యలతో దండు సమ్మయ్య గురువారం మృతిచెందారు. కాగా, బాధిత కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు పాలడుగుల శివకుమార్ ఆధ్వర్యంలో కార్యకర్తలు శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ కమిటీ సభ్యుడు సుంచు కృష్ణ, బస్వ యాదగిరి, పీ.రామస్వామి, అనిల్, సుంచు అశోక్, కొంతం మల్లేశం, శృంగారపు భిక్షపతి, మనోహర్, మేకల శంకర్ పాల్గొన్నారు.

# ఆకట్టుకుంటున్న పరిణయ వస్త్ర ప్రదర్శన



హరిత హోటల్‌లో ఏర్పాటు చేసిన పరిణయ వస్త్ర ప్రదర్శనలో మహిళలు

హన్మకొండ: హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఏర్పాటు చేసిన పరిణయ వస్త్ర ప్రదర్శన నగరవాసులను ఆకట్టుకుంటోంది. దేశంలోని వివిధ రాష్ట్రాల చేనేత కార్మికులు, డిజైనర్ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వస్త్ర ప్రదర్శనలో ఫ్యాషన్ ప్రియులు, మగువలు తమకు కావాల్సినవి కొనుగోలు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్ నిర్వాహకుడు టి.వి.రావు మాట్లాడుతూ వివాహ, శుభకార్యాలు, పండుగలతో పాటు ఇతర ప్రత్యేక సందర్భాల్లో ధరించే, దేశంలో పేరుగాంచిన వివిధ రకాల వస్త్రాలైన ఉప్పాడ, కలంకారీ, మంగళగిరి, ప్రింట్ చీరలు, సిల్క్ చీరలు, కాటన్, కశ్మీర్ సిల్క్ చీరలు, బ్లౌస్‌లు, టాప్స్, వన్ గ్రామ్ గోల్డ్ జువెల్లరీ అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఈనెల 11తో ప్రదర్శన ముగుస్తుందని తెలిపారు.

# కళాకారుల స్మారకార్థం అన్నదానం



హన్మకొండ కల్చరల్: నాటక కళాకారులకు పాత్రలకు తగిన మేకప్, ఆహార్యం (కాస్ట్యూమ్స్) అందించిన నగరానికి చెందిన మొదటితరం మేకప్ మెన్ జడల భద్రయ్య, నటుడు డైరెక్టర్, మేకప్ మెన్ జడల లక్ష్మణ్, మేకప్ మెన్ జడల రాజేశ్వర్ల స్మారకార్థం జేబీ కల్చరల్ ఆర్ట్ సొసైటీ ఆధ్వర్యంలో వరంగల్‌లోని గోపాలస్వామి గుడి జంక్షన్‌లో గురువారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సొసైటీ నిర్వాహకులు జడల శివ, జడల రాజ్‌కుమార్ సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమాన్ని మట్టెవాడ సీఐ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. కార్యక్రమంలో హరిత, స్వప్న, రమాదేవి, శరత్ పాల్గొన్నారు.